




# బోనస్ డబ్బులేవీ?

**రెండు నెలలు కావస్తున్నా సన్న వడ్లు అమ్మిన రైతులకు బోనస్ లేదు..**

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే రూ.30.40 కోట్లు పైచిలుకు బకాయి
- కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



మంచిర్యాల, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తాం. సన్న రకం వరి సాగుకు క్వింటాలు ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తాం.' అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక అసలు బోనస్ ఇవ్వడం లేదు. గత సీజన్‌లో కేవలం సన్న రకం ధాన్యానికే బోనస్ ఇస్తామని, అది కూడా ప్రభుత్వం ప్రకటించిన జాబితాలోని వెరైటీలకే ఇస్తామంటూ ప్రకటించారు. మిషన్ పెట్టి మరీ ధాన్యం గింజ పొడువు, వెడల్పు కొలిచి మరీ బోనస్‌కు ఎంపిక చేశారు. ప్రభుత్వం చెప్పిన వెరైటీలకే బోనస్ అనడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ రకాల సన్న రకాలు సాగు చేసిన రైతుల్లో దాదాపు 30 శాతం నుంచి 40 శాతం మంది బోనస్‌కు దూరమయ్యారు. ఇక కొనుగోళ్లు ఆలస్యం అవడం, కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఎదురు చూడాల్సి రావడంతో చాలా మంది రైతులు ప్రైవేటుకు విక్రయించారు. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ వస్తదని ఆశపడి.. అనేక వ్యయప్రయాసలకోర్చి ధాన్యం విక్రయించిన రైతులకు కాంగ్రెస్ సర్కారు నిలువునా ముంచింది. ధాన్యం విక్రయించి రెండు నెలలు పూర్తయి, మరోవైపు యాసంగి సాగు పనులు సాగుతుంటే ఇప్పటి వరకు బోనస్ ఇవ్వలేదు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటులో విక్రయిస్తే ఎక్కువ ధర ఇస్తామని దళారులు చెప్పినా.. ప్రభుత్వానికి విక్రయిస్తే బోనస్ వస్తుందనుకుంటే రెండూ లేకుండా పోయాయంటూ రైతులు వాపోతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో రూ.30.40 కోట్ల బకాయిలు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 87,839 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. మంచిర్యాల జిల్లాలో సన్నధాన్యం విక్రయించిన రైతుల్లో 7,517 మంది రైతులకు బోనస్ పడగా, 6,796 మంది రైతులకు బోనస్ పడలేదు. ఆసిఫాబాద్ జిల్లాలో సన్నధాన్యం అమ్మిన రైతులు 1468 మంది ఉండగా.. వీరిలో 219 మందికి రూ.72 లక్షలు బోనస్ పడింది. ఇంకా 1,249 మందికి రూ.4.93 కోట్లు రావాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో 8,870 మంది రైతుల నుంచి సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 2,483 మంది రైతులకు రూ.4.80 కోట్ల బోనస్ బకాయిలు చెల్లించాలి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల పరిధిలో ఉట్నూర్, దంతంపెల్లి, బీర్సాయిపేట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది రైతులు సన్నరకం ధాన్యాన్ని విక్రయించారు. వీరిలో దాదాపు సగం మందికి బోనస్ పడలేదని తెలుస్తున్నది. అధికారులు ఈ విషయంపై క్లారిటీ ఇవ్వలేదు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.83.93 కోట్ల బోనస్ డబ్బులు పడాల్సి ఉండగా.. ఇప్పటి దాకా రూ.53.53 కోట్ల బోనస్ డబ్బులే పడ్డాయి. దాదాపు రూ.30.40 కోట్ల బోనస్ బకాయి పడింది.

## రూ.35 వేలు రావాలే..



*ఖానాపూర్, ఫిబ్రవరి 10 : పాత తర్లపాడు శివారులో నాకున్న ఆరెకరాల్లో సన్నరకం వరి సాగు చేశా. ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మూడు నెలల క్రితం ధాన్యాన్ని విక్రయించా. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. ఆ డబ్బులు 48 గంటల్లో బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పింది. 70 క్వింటాళ్ల సన్నరకం వడ్లకు రూ.35 వేల బోనస్ రావాల్సి ఉండగా.. డబ్బులు ఇప్పటివరకు కూడా ఖాతాలో జమ కాలేదు. పీఏసీఎస్, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు సమాధానం చెప్పడం లేదు. మా సోంటి చిన్న, సన్నకారు రైతులను కోతల పేరిట మోసం చేయకుండా బోనస్ డబ్బులను ఖాతాల్లో జమ చేయాలి.*

**- పడిగెల చంద్రయ్య, రైతు, పాత తర్లపాడు.**

## అప్పు చేసి సన్నాలు సాగు చేశా..



*దిలావర్‌పూర్, ఫిబ్రవరి 10 : నాకున్న తొమ్మిదెకరాల వ్యవసాయ భూమిలో సన్న రకం వరి సాగు చేశా. అసలైతే దొడ్డు రకం సాగు చేస్తామనుకున్న. కాంగ్రెస్ సర్కారు సన్నాలకు బోనస్ ప్రకటించడంతో సన్న రకం వరి వేశా. ఇందు కోసం రూ.90 వేల వరకు పురుగుల మందుల దుకాణంలో అప్పు చేశా. పంట దిగుబడి 152 క్వింటాళ్లు, రాగా.. ఈ ధాన్యాన్ని బన్సపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రెండు నెలల క్రితం విక్రయించా. కాంగ్రెస్ సర్కారు సన్నరకం ధాన్యం క్వింటాలు ధాన్యానికి బోనస్‌గా రూ.500 ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన నాకు బోనసే రూ.76 వేలు రావాలి. బోనస్ రాకపోగా అప్పు మాత్రం మిగిలింది. ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటే వారం రోజుల్లో డబ్బులు వస్తుండే. అప్పుల బాధ కూడా తీరుతుండే. సహకార సంఘంలో అధికారులను అడిగితే వస్తాయని అంటున్నారు. కానీ.. రావడం లేదు. ఎప్పుడస్తాయో చూడాలి.*

**- బొడ్డు ముత్యం, రైతు, దిలావర్‌పూర్.**



### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలా..

**రైతులు విక్రయించిన సన్న ధాన్యం :**
**87,839 మెట్రిక్ టన్నులు**

**చెల్లించాల్సిన బోనస్**
**రూ.83.93 కోట్లు**

**చెల్లించిన బోనస్**
**రూ.53.53 కోట్లు**

**బకాయిపడిన బోనస్**
**రూ.30.40 కోట్లు**

## రూ.12,500 రావాలే..

*నాకున్న ఎకరం 20 గుంటల భూమిలో సన్న రకం వరి వేశా. 25 క్వింటాళ్ల వడ్లు రాగా దిలావర్‌పూర్‌లోని బన్సపల్లి సహకార సంఘంలో అమ్మిన. అమ్మిన నెల రోజుల తర్వాత డబ్బులు పడ్డాయి. బోనస్ రాకపోవడంతో అధికారులను అడిగితే పడుతాయని చెప్పారు. ఇప్పటికీ రెండు నెలలు కావస్తున్నది. నా బోనస్ డబ్బులు రూ.12,500 ఎప్పుడస్తాయో ఏమో తెలియడం లేదు. ఈ రోజు(సోమవారం) కూడా సహకార సంఘానికి వెళ్లి అడిగిన. సరిపడా డబ్బులు రాలేదని అధికారులు చెప్పారు.*

**- మహిపాల్‌రెడ్డి, రైతు, దిలావర్‌పూర్**






తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

# రేషన్ కోసం నిరసన

పెంబి, ఫిబ్రవరి 10 : ఆరు నెలలుగా రేషన్ బియ్యం రావడం లేదని గిరిజన గ్రామాలైన శేట్‌పల్లి, యాపల్‌గూడ, రాంనగర్, జంగన్‌గూడ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. శేట్‌పల్లి రేషన్‌షాపు పరిధిలో యాపల్‌గూడ, రాంనగర్, జంగన్‌గూడ గ్రామాలు ఉంటాయి. వీటిలో 355 మంది లబ్ధిదారులు ఉంటారు. కానీ.. ఆరు నెలల నుంచి ఈ రేషన్ షాపునకు 75 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా.. 49 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. దీంతో అందరికీ బియ్యం అందడం లేదు. దీంతో బియ్యం అందరికీ అందించాలని తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు.

# పీడీఎస్ బియ్యం రాకెట్ గుట్టు రట్టు



పట్టుకున్న బియ్యంతో ఎస్పీ జానకి షర్మిల

భైంసా, ఫిబ్రవరి 10 : ధర్మాబాద్ కేంద్రంగా సాగుతున్న పీడీఎస్ బియ్యం దందా గుట్టు రట్టు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ధర్మాబాద్‌కు చెందిన రవూఫ్ ఈ నెల 8న ధర్మాబాద్ నుంచి లక్ష్మణచాందలోని ఓ రైస్ మిల్‌కు 36 టన్నుల పీడీఎస్ బియ్యం లోడ్‌తో లారీ పంపించాడు. ఆ లారీ భైంసా పట్టణంలోకి చేరుకోగానే, నిర్మల్ చౌరస్తా వద్ద ఓ కారును ఢీకొంది. ఈ ఘటనతో సదరు లారీలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ అవినాశ్ కుమార్ ప్రత్యేకంగా దర్యాప్తు జరిపారు. ఇందులో భాగంగా నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనాతో కలిసి మహారాష్ట్రలోని నాందేడ్ పోలీసుల సహకారంతో ధర్మాబాద్‌లో పీడీఎస్ రాకెట్ స్థావరంపై దాడి చేయగా, జిల్లా నుంచి ధర్మాబాద్‌లోని సదరు స్థావరానికి తరలిస్తున్న మరో ఆరు టన్నుల బియ్యాన్ని బిద్రెల్లి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే లక్ష్మణచాందలోని రైస్ మిల్లులో తనిఖీ చేయగా అప్పటికే అక్కడ రెండు ట్రక్కుల్లో ధాన్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించి సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కొన్ని కీలకమైన రికార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశామని, కీలక నిందితుడు రవూఫ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని ఆమె తెలిపారు. కేసు విచారణలో చురుగ్గా పనిచేసిన ముథోల్ సీఐ మల్లేశ్ తోపాటు ఎస్సైలు అశోక్, గణేష్, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు భీమేశ్, గగన్, విపుల్, తాహెర్, రాము, మురళి, శివ, అబుబకర్, అంబాదాస్, అలీంను ఎస్పీ అభినందించారు.

# వినతుల వెల్లువ

- ప్రజావాణిలో 77 దరఖాస్తులు
- పలు సమస్యలపై వినతులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రజావాణిలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి దరఖాస్తులు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ 77 దరఖాస్తులు అందజేశారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు సూచించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు తీసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి

## ఆధార్ కార్డులు ఇప్పించండి..

*మా గ్రామంలో చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు లేవు. కార్డుల కోసం ఆధార్ కేంద్రాలకు పోతే బర్త్ సర్టిఫికేట్ తీసుకుని రమ్మంటున్నారు. మా దగ్గర బర్త్ సర్టిఫికేట్లు లేవు. ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చా. అధికారులు ఎంపీడీవోను కలవాలని సూచించారు. మా వంటి పేదలు ఆధార్ కార్డుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు తిరగాలంటే ఇబ్బందిగా ఉంటుంది.*





## బిల్లుకు సంబంధించిన ఫైల్ దొరకడం లేదంటున్నారు..

*ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో ఇమామ్ ఖాసీం బంగ్లా వద్ద షాపింగ్ కాంప్లెక్స్ పను లు చేస్తున్నా. పనులకు సంబంధించి రూ.37 లక్షల బిల్లుకు సంబంధించిన ఫైల్‌ను మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు దొరకడం లేదంటున్నారు. పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు బిల్లులు చేసి ఫైల్‌ను పంపారు. పది రోజులుగా పంచాయతీరాజ్, మైనార్టీ కార్యాలయాల చుట్టూ చెక్‌పై సంతకం అయిన ఫైల్ కోసం తిరుగుతున్నాం. రెండు శాఖల అధికారులు దొరకడం లేదంటున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి వచ్చా.*

**- అష్రఫ్, ఆదిలాబాద్**

## ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

*బెస్ట్ అవైలెబుల్, ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కుంటాల రామన్న ఆధ్వర్యంలో నాయకులు అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. వీటితోపాటు మెస్ చార్జీలు పెంచాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.*





వాణిజ్య పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# ఐటీ టవర్ పనులు పూర్తి చేయాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 : ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీ టవర్ పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న కోరారు. సోమవారం హైదరాబాద్‌లో వాణిజ్య పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐటీ రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించడంలో భాగంగా 2002 సంవత్సరంలో ఆదిలాబాద్‌కు రూ.40 కోట్లతో ఐటీ టవర్‌ను మంజూరు చేసిందన్నారు. పలు కారణాల వల్ల టవర్ పనులు పూర్తికావడం లేదన్నారు. ఆదిలాబాద్‌లో మూడు ఐటీ పరిశ్రమలు పనిచేస్తున్నాయని వాటిల్లో 400మంది యువత ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. కంపెనీలు ప్రైవేటు భవనాల్లో సరైన వసతులు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో తమ కార్యకలాపాలు విస్తరించలేక పోతున్నాయన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ఐటీ టవర్ అందుబాటులోకి వస్తే సౌకర్యాల ఫలితంగా ప్రస్తుతం కంపెనీలు విస్తరించడంతోపాటు ఇతర కంపెనీలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఫలితంగా వందలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వం టవర్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# మాంగ్ కులానికి గ్రూప్-2 లో చేర్చుటకు సిఫార్సు చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 10 : ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఏబీసీడీగా కాకుండా 1, 2, 3, 4 కేటగిరీలు చేశారని, అందులో మాంగ్ సమాజాన్ని మొదటి కేటగిరీలో పెట్టడంతో నష్ట పోవాల్సి వస్తున్నదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బాలాజీ కాంబ్లే అన్నారు. మొదటి కేటగిరీ నుంచి రెండో కేటగిరీకి మార్చాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ మాంగ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వర్గీకరణలో మాంగ్లకు అన్యాయం జరుగుతుందని వెంటనే సవరించాలని కోరారు. కార్యక్రమంలో మోరే నర్సింగ్, గౌవడే రవి, గైక్వాడ్ సూర్యకాంత్, మధూకర్, విఠల్, కాంబ్లే ఉద్ధవ్, దాసరి రాంప్రసాద్, డోంగ్రె సంజీవ్ పాల్గొన్నారు.